సాక్షి ఆదిలాబాద్

శనివారం । 28 । జనవరి । 2023



జనసంద్రంగా నాగోబా 10లో▸

నాగోబా జాతరకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సరస్వతీ అమ్మవారికి లక్ష్మీకటాక్షం



బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారికి వసంతపంచమి సందర్భంగా గురువారం ఒక్కరోజే రూ.71.91లక్షల ఆదాయం సమకూరింది. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతంతో పాటు రాత్రి వేళలో చలి ప్రభావం కొంతమేర తగ్గనుంది.

న్యూస్‌రీల్

ముగిసిన రేషన్ డీలర్ల ఎంపిక ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఆర్డీవో రమేశ్‌రాథోడ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 27 షాపుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేయగా 26 షాపులకుగాను 338 దరఖాస్తులు అందాయి. ఒక దుకాణానికి దరఖాస్తు రాలేదు. దరఖాస్తుదారులకు ఈ నెల 22న రాత పరీక్ష నిర్వహించారు. మెరిట్ ఆధారంగా 1:5 చొప్పున 117మందిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఇందులో 114 మంది హాజరుకాగా ఆర్డీవో రమేశ్ రాథోడ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారికి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు స్క్రీనింగ్

ఆదిలాబాద్‌టౌన్: జపాన్ దేశంలో పనిచేసేందుకు అర్హతగల నర్సింగ్ అభ్యర్థులకు శుక్రవారం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో రిమ్స్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. టామ్‌కామ్‌కు చెందిన ప్రతినిధులు నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. కోవిడ్ తర్వాత పోస్టుల భర్తీ కోసం తమ కంపెనీ దృష్టి సారించిందని మేనేజర్ శబానా తెలిపారు. జపాన్ ప్రభుత్వం నర్సుల కోసం ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని పేర్కొన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి జపాన్ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినూత్న నిరసన



భిక్షాటన చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మూడు రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో స్టాఫ్ నర్సులు కరుణ, వెంకటలక్ష్మి, పెర్సి, కృష్ణకుమారి, శోభారాణి, వసంతరాణి, కవిత, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

ఆదిలాబాద్/ఆదిలాబాద్‌రూరల్: గ్రూప్ 2, 3, 4 పరీక్షలకు సంబంధించిన స్పెషల్ ఫౌండేషన్ కోర్సు ఉచితశిక్షణకు జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 31 సాయంత్రం 5గంటల్లోపు www. tsstudycircle. co. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 08752-224733, 94941 49416, 93987 84343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి

ఆదిలాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వర్సిటీ అధ్యయన కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ ప్రతాప్‌సింగ్ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాక్ ద్వారా మెయిల్ వస్తుందని తెలిపారు. ఆ మెయిల్‌కు స్పందించి అందులోని 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. న్యాక్ అక్రిడిటేషన్ అసిస్మెంట్ కార్యక్రమంలో భాగంగా వర్సిటీ అందించే సేవలపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు న్యాక్ మెయిల్ ద్వారా ప్రశ్నావళిని పంపుతుందని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలున్నా అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రెండ్రెండు.. గంటలిస్తున్నరు



నేను యాసంగిలో పదెకరాల్లో గోధుమ, శనగ, జొన్న సాగు చేస్తున్న. త్రీఫేజ్ కరెంట్ రాత్రి 2 గంటలు, పగలు 2 గంటలు మాత్రమే ఇస్తున్నరు. మిగతా టైంలో సింగిల్ ఫేజ్ ఉంటంది. దీంతో మోటార్లు పనిచేయడం లేదు. పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. – రాజు, జామిడి గ్రామం, ఇచ్చోడ మండలం

మొక్కజొన్న ఎండుతంది



బజార్‌హత్నూర్ శివారులో నాలుగెకరాల్లో మొక్కజొన్న వేసిన. త్రీఫేజ్ కరెంటు 6 గంటలు కూడా సరిగా రావట్లేదు. పంటంతా ఎండిపోతంది. ఇప్పటికే రూ.లక్ష వరకు ఖర్చు చేశా.
– దీసి విజేందర్, రైతు, బజార్‌హత్నూర్

రోడ్డెక్కిన అన్నదాత



తాంసిలో సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఏఈ మనోజ్ కుమార్

- అప్రకటిత కరెంట్ కోతలపై ఆందోళన
- పంటలు ఎండుతున్నాయంటూ ఆవేదన
- పలుచోట్ల సబ్‌స్టేషన్ల ముట్టడి, రాస్తారోకో

సాక్షి,ఆదిలాబాద్: అప్రకటిత కరెంట్ కోతల కారణంగా యాసంగి పంటలకు నీళ్లందక కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు లబోదిబోమంటున్నారు. సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్న పాలకుల మాటలు ఆచరణలో కనిపించడం లేదంటున్నారు. 5 నుంచి 8 గంటలకు మించి ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం ఆందోళన బాట పట్టారు. జిల్లాలోని తాంసి, తలమడుగు, బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలాల్లో సబ్‌స్టేషన్లను ముట్టడించారు. రాస్తారోకో చేపట్టారు.

జిల్లాలో యాసంగి పంటల సాగు వివరాలు..	
సాధారణ సాగు	1,47,606 ఎకరాలు
ఇప్పటివరకు సాగైంది	1,45,000 ఎకరాలు
పంటల వారీగా..	
శనగ	లక్ష 3వేల ఎకరాలు
జొన్న	26,148 ఎకరాలు
మొక్కజొన్న	13,415 ఎకరాలు
ఇతర పంటలు	2,437 ఎకరాలు (గోధుమ, పెసర, మినుములు, ఇతరత్రా)

నీళ్లు అందించాల్సిన పరిస్థితుల్లో..

యాసంగిలో శనగ, జొన్న, మొక్కజొన్న, గోధుమ, పెసర, మినుములు, నువ్వులు ఇతర పంటలను జిల్లా రైతులు సాగు చేశారు. సాధారణ సాగుకు అటుఇటుగా ఇప్పటివరకు సాగైంది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. శనగ ప్రస్తుతం కాత, పూత దశలో ఉంది. కోతకు సమయం దగ్గర పడుతుంది. ప్రస్తుతం ఈ పంటకు నీళ్లు సమృద్ధిగా అందిస్తేనే దిగుబడిపై రైతుకు ఆశ ఉంటుంది. అయితే అప్రకటిత కరెంటు కోతల కారణంగా పంటకు నీరందించలేక పోవడంతో ఎండిపోతుందా.. అనే ఆందోళన ప్రస్తుతం వారిని వెంటాడుతుంది. జొన్న, వేరుశనగ విత్తనాలు వేస్తున్నారు. వేసిన వారు పంటకు నీటి తడి అందించాలి. మొక్కజొన్న ఇప్పటికే సాగు చేశారు. దానికి కూడా నీళ్లు అధిక మొత్తంలో అందించాలి. అయితే అనధికార విద్యుత్ కోతల కారణంగా రైతులు నీరందించలేక పోతున్నారు. అసలు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో వారికి పంట చేలను వదిలి సబ్‌స్టేషన్ల ముట్టడి, రాస్తారోకోలు వంటి ఆందోళనలు చేపట్టాల్సిన దుస్థితి దాపురించింది.

పొంతన కుదరని అధికారుల మాటలు..

సాగుకు విద్యుత్ అంతరాయం ఉన్న మాట వాస్తవమేనని విద్యుత్ శాఖాధికారులు ఒప్పుకుంటున్నా, మరోవైపు పది గంటలకు పైగా త్రీఫేజ్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు కొన్నిచోట్ల నాలుగు గంటలే వస్తుందని, మరికొన్ని చోట్ల ఆరు గంటలు మాత్రమే వస్తుందని అంటున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



నేను 14 ఎకరాల్లో గోదుమ, మొక్కజొన్న, ధనియా సాగు చేస్తున్న. కరెంట్ కోతలతో పంటలకు నీరందించలేక పోతున్న. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు స్పందించి పగటి వేళలోనే త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని కోరుతున్నాం.
– తురాటి భోజన్న, రైతు, బజార్‌హత్నూర్

24 గంటల కరెంట్ ఇవ్వాలి



జామిడిలో పదెకరాల్లో జొన్న సాగు చేశా. సాయంత్రం 5 గంటలకు కరెంటు పోతే ఉదయం 5 వరకు ఇవ్వడం లేదు. పగటి వేళల్లో బ్రేక్‌డౌన్, మరమ్మతుల కోసం ఎల్‌సీ పేరిట కరెంటు నిలిపివేస్తున్నారు. ఇలా అయితే పంటలు ఎండిపోవడం ఖాయం. 24 గంటల కరెంట్ ఇవ్వాలి. – బద్దం వినోద్ రెడ్డి, జామిడి, గ్రామం, తాంసి మండలం

ఆందోళన వద్దు.. సమస్య పరిష్కరిస్తాం



త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం వాస్తవమే. పవర్ గ్రిడ్‌లో అధికలోడ్‌తో సమస్య ఏర్పడింది. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 వరకు, రాత్రి 12 నుంచి వేకువజామున 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నాం. సమస్య రెండు రోజుల్లో పరిష్కారం అవుతుంది. ఆ తర్వాత రైతులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తాం. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దు.
– సంపత్ కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, ఆదిలాబాద్

తలమడుగులో రాస్తారోకో..



రాస్తారోకోలో పాల్గొన్న రైతులు

తలమడుగు: అప్రకటిత కరెంట్ కోతలను నిరసిస్తూ మండల రైతులు సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గంటసేపు చేపట్టిన ఆందోళనతో సమాచారం అందుకున్న ఎస్సై ప్రవళిక అక్కడికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

తాంసిలో సబ్‌స్టేషన్ ముట్టడి

తాంసి: నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గంట పాటు చేపట్టిన ఆందోళనతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఏఈ మనోజ్ రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

ఇచ్చోడలో..



ఏడీఈతో వాగ్వాదానికి దిగిన రైతులు

ఇచ్చోడ: సాగుకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ జామిడి, మాదాపూర్, ఇచ్చోడ, అడేగామ కే గ్రామాల రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఏడీఈ సుబ్రహ్మణ్యంతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ ఇవ్వని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కంటి వెలుగు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



స్క్రీనింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మండలంలోని గిమ్మ గ్రామంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. స్క్రీనింగ్ తీరు, వసతులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అవసరమైన ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందించాలన్నారు. సర్జరీ అవసరం ఉన్న వారిని రిమ్స్‌కు రెఫర్ చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఇప్పటి వరకు 630 మందికి పరీక్షలు పూర్తి చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సుచల కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ వెంట ఎంపీపీ గోవర్ధన్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో గజానన్‌రావ్, నాయకులు పరమేశ్వర్, భోజన్న, హెచ్ఈవో జావేద్, సిబ్బంది ఉన్నారు.

సిర్సన్న గ్రామంలో..

బేల: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మండలంలోని సిర్సన్న గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇన్‌చార్జి వైద్యాధికారి నైనత నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ రాంరెడ్డి, వైద్యాధికారి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా ప్రదర్శన

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా, ఖాళీల వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయ నోటీస్‌బోర్డుపై ప్రదర్శించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, డీఈవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద జిల్లాలోని ప్రతీ మండలానికి రెండేసి చొప్పున 18 మండలాల్లో మోడల్ పాఠశాలలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 18 పాఠశాలల్లో వందశాతం పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీఈవో ప్రణీత, సెక్టోరల్ అధికారి నారాయణ, డీపీవో శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ప్రాధాన్యత విభాగంలో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27నుంచి 30 వరకు రిమ్స్ ఆస్పత్రిలో సదరు టీచర్ల మెడికల్ ధ్రువీకరణ పత్రాలను ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో పరిశీలించనున్నట్లు తెలిపారు. విషయాన్ని సంబంధిత ఉపాధ్యాయులు గమనించి ధ్రువపత్రాలను పరిశీలన చేసుకోవాలని సూచించారు.

కృత్యాధార బోధన చేపట్టాలి



ఉపాధ్యాయులకు సైన్స్ కిట్లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్

ఆదిలాబాద్: కృత్యాధార బోధనతోనే విద్యార్థులకు మెరుగైన అభ్యసన సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి చేపడుతున్న కృత్యాధార బోధన శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృత్యాల ద్వారా సైన్స్‌ను బోధించడంతో విద్యార్థులు చక్కగా నేర్చుకుంటూ జీవితాంతం ఆ అంశాన్ని గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సైన్స్ కిట్లతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, బయోసైన్స్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘువేందర్, పోచ్చ రెడ్డి, సత్యనారాయణ, జీవశాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చర్చకొచ్చేనా..?

- ప్రజా సమస్యలపై చర్చ సాగేనా..
- పత్తికి లభించని గిట్టుబాటు ధర
- అన్నదాతను వేధిస్తున్న విద్యుత్‌కోతలు
- పూర్తి కాని 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక
- ఇంకా అందని 'మిషన్ భగీరథ'
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

జిల్లా పరిషత్ కార్యాలయం



కైలాస్‌నగర్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు అనధికార విద్యుత్ కోతలతో యాసంగి పంటలకు నీరందక అన్నదాత రోడ్డెక్కుతున్నాడు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం అర్హులకు ఏళ్లుగా నిరీక్షణ తప్పని పరిస్థితి. ఇప్పటికీ మారుమూల పల్లెలకు మిషన్ భగీరథ నీరు అందకపోవడం గమనార్హం. ఇలాంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఇందులోనైనా సమస్యలపై చర్చించి వాటికి పరిష్కారం చూపుతారనే ఆశ జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జరిగే సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

- అనధికార అప్రకటిత విద్యుత్ కోతలు అన్నదాతను ఆవేదనకు గురిచేస్తున్నాయి. యాసంగిలో వేసిన పంటలకు నీరందక వారంతా రోడ్డెక్కుతున్నారు. 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా ఆరు గంటలు సైతం సరఫరా కావడం లేదని రైతులు వాపోతున్నారు.
- ఇంటింటికీ శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్‌భగీరథ పథకం జిల్లాలోని పలు గ్రామాలకు ఇప్పటికీ అందడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నల్లా కనెక్షన్లు పెట్టిన చోట కూడా నీటి సరఫరా సక్రమంగా కావడం లేదు. వేసవి సమీపిస్తోంది. ఎండల తీవ్రత పెరిగింది. గ్రామాల్లో నీటి సమస్య జఠిలమయ్యే ప్రమాదం లేకపోలేదు. నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- పత్తికి గిట్టుబాటు ధర అందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ వాణిజ్య కొనుగోళ్ల పేరిట రంగంలో ఉన్నా కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదు. ధర పెరుగుతుందనే ఆశతో పంటను ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించకుండా ఇళ్లలోనే నిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలో వారిని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. మరోవైపు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఘటనలు వారిలో గుబులు రేపుతున్నాయి. ఇక పత్తి ధర రోజురోజుకూ పడిపోతుండడంతో వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ప్రైవేట్‌తో పోటీ పడి సీసీఐ వాణిజ్య కొనుగోళ్లు చేపడితే తప్ప రైతుకు ప్రయోజనం కలిగే అవకాశముండదు.
- ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, రైతు కల్లాల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరు కావడం లేదు. పనులు చేపట్టిన గుత్తేదారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురవుతున్నారు. పనులకు హాజరైన కూలీలు సైతం నెలల తరబడి కూలి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి.
- కొత్తగా పింఛన్లు మంజూరవగా అందులో సగం మంది పింఛన్లు కట్ చేశారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఈ సమస్యపైనే ఎక్కువగా అర్జీలు వస్తున్నాయి.
- కొత్తగా ధరణి పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రైతుబంధు సాయం అందడం లేదు. దాని కోసం వ్యవసాయ శాఖలో దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక జిల్లాలో ఇంకా పూర్తికాలేదు. జనవరి 13 నాటికి గ్రామసభల ద్వారా ప్రక్రియ పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంతిరెడ్డి ఆదేశించినా ఇప్పటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. దీంతో అర్హులైన వారు తమకు డబుల్ ఇళ్లు ఎప్పుడిస్తారా అని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.
- మన ఊరు–మన బడి కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సుందరీకరణ పనులు నత్తనకడన సాగుతున్నాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రూ.30లక్షల పైన నిధుల కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉన్నతాధికారులు పదేపదే గడువు నిర్దేశించినా ప్రగతి మాత్రం కన్పించడం లేదు. పాఠశాలల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు.
- గతేడాది కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని గ్రామీణ రోడ్లు అనేక చోట్ల ధ్వంసమయ్యాయి. తాత్కాలికంగా కొన్ని చోట్ల మరమ్మతులు చేసినా చాలా చోట్ల రోడ్లు నడువడానికి వీల్లేకుండా ఉన్నాయి. కల్వర్టులు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

యథేచ్ఛగా భూఆక్రమణలు..

జిల్లాలో భూఆక్రమణల దందా యథేచ్ఛగా సాగుతుంది. రియల్ వ్యాపారులు, కొంత మంది రాజకీయ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ వంటి భూములేవైనా సరే వాటిపై కన్నేస్తే చాలు నకిలీపత్రాలు సృష్టించి తమ హస్తగతం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని సీసీఐ పరిశ్రమకు సంబంధించిన వందలాది ఎకరాల లీజు భూములు అన్యాక్రాంతమవుతుండగా, మావల, బట్టిసావర్‌గాంవ్, ఖానాపూర్ పరిధిలోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఇదంతా ఉన్నతాధికారుల కళ్లెదుటే సాగుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొంతమంది అధికారులు కబ్జాదారులకు వంతపాడుతుండటంతోనే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్రగాయాలు



ముందుభాగం దెబ్బతిన్న కారు

తాంసి: అతివేగంతో వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన తాంసి ఆరోగ్య కేంద్రం సమీపంలోని మూలమలుపు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాంసి మండల కేంద్రానికి శైలేష్ గురువారం రాత్రి ఆదిలాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. సుంకిడి, తాంసి గ్రామాల రోడ్డుపై అతివేగంగా కారు నడుపుతున్నాడు. అదుపుతప్పి మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొన్నాడు. డ్రైవింగ్ చేస్తున్న శైలేష్ తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

నేరడిగొండ: మండల కేంద్రంలోని అంకుల్ లొద్దిగుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని శుక్రవారం పట్టుకున్నట్లు స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ (ఎస్‌బీ) నారాయణ స్వామి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు వివరించారు.

ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్‌బోర్డు కాలనీ జోన్ 3లో నివాసం ఉంటున్న పెద్ది చిన్న శేఖన్న ఇంట్లో గురువారం చోరీ జరిగింది. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. పెద్ది చిన్న శేఖన్న మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగొచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో 17 తులాల బంగారు, 33 తులాల వెండిని ఎత్తుకెళ్లారని గుర్తించారు. రూ.5,26,500 విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ చేశారని శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి, ఎస్సై విష్ణువర్ధన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక కిడ్నాప్, లైంగికదాడి

- ఒకరిపై పోక్సో కేసు

మామడ: మండలంలోని ఓ గ్రామం నుంచి మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన గైక్వాడ్ సునీల్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సోన్ సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. సునీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బాలికను వేధించిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను వేధించిన కేసులో ఒకరిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం ..17 ఏళ్ల బాలికను పట్టణానికి చెందిన గెడాం సునీల్ వెంటపడి వేధింపులకు పాల్పడుతున్నాడు. శుక్రవారం బాలిక బహిర్భూమికి వెళ్లిన సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కుటుంబీకులకు విషయాన్ని తెలిపింది. దీంతో వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ఆదర్శ’ం పిలుస్తోంది..

- మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు
- ఫిబ్రవరి 15 చివరి తేదీ
- 6వ తరగతిలో ఉమ్మడి జిల్లాలో 1400 మంది విద్యార్థులకు అవకాశం
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష



ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు ప్రకటన వెలుబడింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైనా నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యకు ఈ పాఠశాలు దోహద పడనున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితం ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలను నెలకొల్పింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ), మందమర్రి, మంచిర్యాల్, కుంటాల, కోటపెల్లి, కాసిపేట్, దండేపల్లి, నార్నూర్, గుడిహత్నూర్, జైనథ్, బోథ్, ఆదిలాబాద్ (బంగారుగూడ), బజార్‌హత్నూర్‌లో ఈ పాఠశాలలు ఉన్నాయి.

సీట్ల కేటాయింపు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలో 6వ తరగతిలో 14వందల మంది విద్యార్థుల ప్రవేశం ఉంటుంది. దీంతోపాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిలో నిర్వహిస్తారు. 100 సీట్లలలో ఎస్సీ విద్యార్థులకు 15 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, బీసీ విద్యార్థులకు 29శాతం ఉంటాయి. ఇందులో (బీసీ ఎ–7) (బీసీ బి–10) (బీసీ సీ–1)(బీసీ డి–7)(బీసీ ఈ–4)తో పాటు ఓపెన్ కేటగిరీలో 50 సీట్లను భర్తీ చేయనున్నారు. అన్నీ కేటాగిరీలోనూ బాలికలకు 33 శాతం, 3శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించనున్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ఇలా..

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వైబ్‌సైట్ వైబ్‌సైట్ http//telanganams.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్‌ఫోటో, ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బోనఫైడ్ జిరాక్స్ పత్రాలు ఏ పాఠశాల ప్రవేశం కోసం నమోదు చేసుకున్నామో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి.

ప్రవేశ పరీక్ష విధానం

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షని అబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టుల నుంచి ఒక్కొదానిలో 25ప్రశ్నలు ఇస్తారు.

ఫిబ్రవరి 15 తుది గడువు

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కోసం జనరల్ కేటాగిరీ విద్యార్థులకు రూ.200 ఈడబ్ల్యూఎస్ దివ్యాంగుకలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 12వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుంది.

లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత



ఆదర్శ పాఠశాలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో 6వ తరగతిలో 100 సీట్లు మిగితా 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం. లోకల్ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తాం.

– అబ్దుల్ ఖలీల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

మోడల్ స్కూల్ ప్రత్యేకత...

- 6 నుంచి 10వ తరగతి వరకు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా బోధన
- ఆంగ్ల మాధ్యమంలో విద్య
- పక్కా భవనంతో తరగతి గదులు
- 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వమే పుస్తకాలను అందజేస్తుంది.
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- నాణ్యమైన మధ్యాహ్నభోజనం, పౌష్టికాహారం అందజేత.
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్‌ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు

రేపు వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం

కైలాస్‌నగర్: వైఎస్సార్‌టీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఆదిలాబాద్‌లోని భజరంగ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యచరణ కమిటీ సభ్యులు పిట్ట రాంరెడ్డి, గట్టు రామచంద్రారావు, మాజీ జెడ్పీచైర్మన్ కవిత, కొండ రాఘవరెడ్డి, నిర్మలం రమేశ్, శాంతికుమార్, ఏపూరి సోమన్న ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ ఉమ్మడి జిల్లా నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

పాచ్చరలో దొంగల హల్‌చల్



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దొంగలు

బోథ్: మండలంలోని పొచ్చరలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గతకొన్ని రోజులుగా గ్రామంలో కొంతమంది అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గురువారం రాత్రి లక్ష్మణ్‌కు చెందిన బైక్‌ను దొంగిలించారు. రోడ్డుపై దొంగలు వెళ్తున్నట్లు సీసీ సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు.

బుడుందేవు ఆలయంలో పూజలు

- నేటి నుంచి జాతర ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, సర్పంచులు

ఉట్నూర్‌రూరల్: కేస్లాపూర్ నాగోబా జాతర అనంతరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే బుడుందేవు జాతర శనివారం ప్రారంభం కానుంది. నాగోబా పూజల అనంతరం గురువారం మెస్రం వంశీయులు ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌కు చేరుకుని శుక్రవారం మధ్యాహ్నం బుడుందేవు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించినట్లు ఎంపీపీ తెలిపారు. సర్పంచ్ మల్లిక, ఆలయ చైర్మన్ మెస్రం నాగోరావు, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, పంటేల్ మెస్రం వంశీ పటేల్, కటోడ, మెస్రం వంశీయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు భార్యాభర్తలు ఒకేచోటికి

- జిల్లాకు 10 మంది స్పౌజ్ టీచర్ల కేటాయింపు
- జిల్లా నుంచి నిజామాబాద్‌కు ఒకరు
- ఫలించిన ఉపాధ్యాయుల ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: భర్త ఒక చోటా..భార్య మరోచోటా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న స్పౌజ్ టీచర్లకు ప్రభుత్వం ఎట్టకేలకు తీపికబురు అందించింది. గతేడాదిగా ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. జీవో 317 ద్వారా జిల్లాలోని స్పౌజ్ ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు కేటాయించారు. దీంతో భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం బదిలీ, పదోన్నతులు చేపడుతున్న నేపథ్యంలో స్పౌజ్ టీచర్లకు సైతం శుభవార్త అందించింది. గురువారం రాత్రి రాష్ట్రప్రభుత్వం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు పరస్పర బదిలీలకు అనుమతి ఇచ్చినప్పటికీ 13 జిల్లాల్లో బదిలీలను నిషేధించిన విషయం తెలిసిందే. తాజాగా వాటిని ఎత్తివేసి వారు పనిచేస్తున్న చోటికి రిలీవ్ చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

జిల్లాకు పది మంది టీచర్లు

జీవో 317 ద్వారా జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు కేటాయించారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 45 మంది నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. దీంతో భర్త ఒక చోటా, భార్య మరోచోటా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురయ్యారు. డీఈవో కార్యాలయం, కలెక్టరేట్, డీఎస్‌ఈ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు వారి ఆందోళనలు ఫలించాయి. ఈ స్పౌజ్ బదిలీల్లో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు 10 మంది టీచర్లు రాగా, జిల్లా నుంచి ఒకరు నిజామాబాద్‌కు వెళ్లనున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు నిర్మల్ నుంచి ముగ్గురు, ఆసిఫాబాద్ నుంచి నలుగురు, మంచిర్యాల నుంచి ముగ్గురు వస్తున్నారు. వీరిలో పదిమంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇంకా 38 మంది ఇతర జిల్లాలో స్పౌజ్ టీచర్లు పనిచేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. వారికి సైతం అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కాగా శుక్రవారం సాయంత్రం విద్యాశాఖాధికారులు వారికి పోస్టింగ్‌లు కేటాయించారు.

అటవీశాఖ అధికారులపై చర్యలు చేపట్టాలి



నిరసన చేపడుతున్న గిరిజన నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలం నాగులకొండ గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు లింబారావుపై అటవీ శాఖ అధికారులు చేసిన దాడిని నిరసిస్తూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. కొలాం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సోనేరావు మాట్లాడుతూ దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కొమురం సూరు యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, కొలాం హక్కుల పోరాట సమితి జైనథ్, బేల మండలాల అధ్యక్షులు గోవింద్‌రావు, టేకం లక్ష్మణ్, పురుషోత్తం, శేషారావు, శత్రుగన్, కేశవ్, మోతిరాం, నాగేశ్, గణేశ్, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: లింబారావుపై దాడి చేసిన అటవీ అధికారులను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అటవీ కార్యాలయాన్ని తుడుందెబ్బ అధ్వర్యంలో ముట్టడించి ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి 20 ఎకరాల అటవీ భూమి సాగు కోసం కేటాయించాలన్నారు. కుటుంబంలో ఒకరికి అటవీశాఖలో ఉద్యోగం, రూ.20 లక్షలు నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు నాగోరావ్, పరమేశ్వర్, బోంత ఆశరెడ్డి, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రోత్సాహకం’లో జాప్యం

- పేరుకుపోయిన కేసీఆర్ కిట్ పథకం బకాయిలు
- ఆసుపత్రుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ
- జిల్లాలో 8,891 మంది లబ్ధిదారుల నిరీక్షణ
- సకాలంలో జమా చేయాలని కోరుతున్న లబ్ధిదారులు



ఆదిలాబాద్‌రూరల్: మాతాశిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులకు ఆదరణ పెరగాలన్న లక్ష్యంతో సర్కారు వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకున్న వారికి కేసీఆర్ కిట్‌తోపాటు నగదు అందించారు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు కిట్లు ఇస్తున్నా నగదు అందడం లేదు. ఫలితంగా వారు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు విడతలుగా అందజేసే ప్రోత్సాహకానికి నానా పాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. నిధుల కొరత వల్లే మంజూరు కావడం లేదని తెలుస్తోంది.

8,891 మంది నిరీక్షణ

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని జూన్ 2017 ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేస్తోంది. నాలుగు విడతలుగా సాయాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమచేయాలి. 30 నవంబర్ 2022 వరకు కిట్ పొందిన వారు 32,344 ఉండగా 23,453 మందికి ఆర్థిక సాయం అందుకున్నారు. 8,891 మంది లబ్ధిదారులకు ఇంకా రావాల్సి ఉందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. పథకంలో భాగంగా గర్భం దాల్చిన మహిళకు మొదట రూ.3 వేలు ఖాతాలో జమ చేస్తారు. కాన్పు కాగానే ఆడశిశువు అయితే రూ.5 వేలు, మగ శిశువు అయితే రూ.4 వేలు, మూడు నెలల తర్వాత రూ.2 వేలు, తొమ్మిది నెలలకు రూ.3 వేలు, ఇలా నాలుగు విడతలుగా లబ్ధిదారులకు అందజేస్తారు. అయితే రెండు ప్రసవాలకు మాత్రమే ఇది అందుతోంది. ప్రభుత్వం కేసీఆర్ కిట్ అమలు చేశాక, సర్కారు దవాఖానాల్లో కాన్పుల సంఖ్య పెరిగింది.

సకాలంలో అందని డబ్బులు

కాన్పులు జరిగి నెలలు గడిచిపోతున్నా నగదు అందక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. పైసలు వస్తే పౌష్టికాహారానికి వినియోగించుకునే వారమని పేర్కొంటున్నారు. ఆసుపత్రిలో సిబ్బందికి అడిగితే నిధులు విడుదలైన వెంటనే నేరుగా ఖాతాల్లోకి వస్తాయని సర్ది చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో తమ వివరాలు నమోదు చేయడం లేదని అందుకే సాయం అందడం లేని మరికొంతమంది వాపోతున్నారు.

రెండేళ్ల నుంచి డబ్బులు రాలేదు

నేను 2020లో రిమ్స్‌లో మగ శిశువుకు జన్మించాడు. అప్పుడు కేసీఆర్ కిట్ ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రోత్సాహకానికి సంబంధించిన డబ్బులు రాలేదు. ప్రభుత్వం ఆ డబ్బులు ఇస్తే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి.

– మ్యాకల స్వప్న, లాండసాంగ్వి, ఆదిలాబాద్ రూరల్

నేరుగా వారి ఖాతాల్లో..

గర్భిణులు, బాలింతలకు సంబంధించిన ప్రోత్సాహక నిధులు నేరుగా వారి ఖాతాలో జమా అవుతాయి. దశలవారీగా అందిస్తున్నారు. రానివారు ఆందోళన చెందొద్దు.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్

భయాన్ని పోగొట్టడమే పరీక్ష పే చర్చ లక్ష్యం



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఆదిలాబాద్: విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టడమే ‘పరీక్ష పే చర్చ ’లక్ష్యం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ ‘పరీక్ష పే చర్చ’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌ఈడీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయగా, బీజేపీ నాయకులు, విద్యార్థులతో కలిసి శంకర్ వీక్షించారు. ప్రధాని విద్యార్థులను ఉద్దేశించి పరీక్షల గురించి భయాన్ని వదిలేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, రాజేష్, శ్రీనివాస్, ముకుంద్‌రావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో హత్యాయత్నం




చికిత్స పొందుతున్న సత్తార్

రామకృష్ణాపూర్: మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో ఒకరిపై ఐదుగురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మందమర్రి సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ... కాగజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సత్తార్ కొంతకాలంగా స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంత్రాలు చేస్తూ అదే ప్రాంతానికి చెందిన పలువురు అనారోగ్యానికి కారణమవుతున్నాడని, అలాగే కొంతమంది మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పట్టణానికి చెందిన బుడిగె వంశీ, ప్రకాష్, రవి, సాయి అనే నలుగురితో పాటు దర్గాకు ఆనుకునే ఉన్న స్థలం విషయంలో గతంలో సత్తార్‌తో గొడవపడిన బీజేపీ నాయకుడు పాలరాజయ్య కలిసి దర్గాలో నిద్రిస్తున్న సత్తార్‌పై ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన సత్తార్‌ను కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం

భీమిని: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు ఇందూరి మహేష్ తన చేనులో పండిన సుమారు 250క్వింటాళ్ల పత్తికి ధర లేకపోవడంతో ఇంటి వద్ద ఉంచుకున్నాడు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా సుమారు 15క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. దీంతో రూ.లక్షా 50వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సంఘటనా స్థలాన్ని కన్నెపల్లి ఎస్సై సురేష్ పరిశీలించి షార్ట్ సర్క్యూటా? ఎవరైనా నిప్పంటించా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.



మంటలు ఆర్పివేస్తున్న రైతులు